అక్రమ నిర్మాణాలు

- మద్యం దుకాణం ఏర్పాటుతో వెంచర్లలో వెలుస్తున్న డబ్బాలు
- చోద్యంచూస్తున్న మున్సిపల్, ట్రాన్స్‌కో అధికారులు



అమరచింతలోని ఓ వెంచర్‌లో వైన్‌షాప్ పక్కన వెలిసిన డబ్బాలు

అమరచింత: అనుమతి లేని వెంచర్‌లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్న మున్సిపల్ పాలక మండలి, అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం అనుమతిపొందిన వ్యక్తి ప్రస్తుతం వాటిని వైన్‌షాప్‌కు అద్దెకు ఇవ్వడంతో వెంచర్‌లోని స్థలాల్లో చికెన్ ఫ్రై డబ్బాలు, కూల్‌డ్రింక్ షాప్‌లు పుట్టగొడుగులుగా వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతి తప్పనిసరి అనే నియమం ఉన్నా.. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేకపోవడంతో అక్రమ వెంచర్‌లో నిర్మాణాలు జోరందుకున్నాయి. పట్టణ శివారులో కేవలం నాలా పర్మిషన్‌తో ప్లాట్లను అమ్మడం, వాటిలో విద్యుత్, తాగునీటి వసతులతో పాటు డ్రెయినేజీ వసతులు కల్పించకుండానే ప్లాట్లను యథేచ్ఛగా విక్రయించినా.. సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. పట్టణ శివారులో అయ్యప్ప కాలనీ, హరిహరపుత్రల పేరిట వ్యవసాయ పొలంలో నాలా పర్మిషన్ తీసుకుని ప్లాట్లుగా విక్రయించారు. వీటికి డీటీసీపీ అనుమతి తీసుకోవాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు విన్నవించడంతో సదరు యాజమాని వీటిని విస్మరించారు. ప్రస్తుతం రహదారి పక్కన మద్యం దుకాణం ఏర్పాటు కావడంతో మరోమారు అక్రమ వెంచర్ బాగోతం వెలుగుచూసింది.

ప్రమాదాలకు నిలయం..

ప్రస్తుతం రహదారి పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మందుబాబులు నిషా మత్తులో తమ ద్విచక్రవాహనాలను ప్రధాన రహదారిపై తీసుకొస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించలేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే రహదారిపై పలువురు ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. రహదారి పక్కన కాకుండా వాటిని లోపలి స్థలంలో ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లు...

దినదినం వెలుస్తున్న డబ్బాలకు విద్యుత్ సౌకర్యం కోసం అక్రమ విద్యుత్ కనెక్షన్లు పొందుతున్నారు. సమీపంలోని పెట్రోల్‌బంక్ నిర్వాహకుడు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్లు పొందుతున్నా.. సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేకపోతున్నారు. వెంచర్ నిర్వహణలో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ ఏర్పాటు ఉండాలనే నియమం ఉందని అలాంటివి లేకుండానే ప్లాట్లను ఎలా అమ్మారని మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంతోనే ఇలాంటివి జరుగుతున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు..



వెంచర్ నిర్వహణలో డీటీసీపీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, కేవలం నాలా పర్మిషన్‌తో ప్లాట్లను అమ్మడం జరిగినా.. అవి చట్టపరంగా చెల్లవు. అక్రమ వెంచర్‌లో వెలుస్తున్న దుకాణ సముదాయాలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలు లేకుంటే అనుమతులు నిలిపివేస్తాం.

– మహ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్

ఆరు గ్యారంటీలు అమలు చేయనున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్

పాన్‌గల్: ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక అమలు చేస్తుందనే నమ్మకం ప్రజల్లో కలిగిందని ఏఐటీయూసీ జిల్లా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు హామీలను అమలు చేసిందని, మిగతా నాలుగు హామీలను కూడా తప్పక అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయించాల్సిన బాధ్యత సీపీఐ పార్టీపై ఉందన్నారు. ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలపై పేద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇల్లు మంజూరు చేయాలని, రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం మంజూరు చేయాలన్నారు. నూతన ప్రభుత్వం హామీలను విస్మరిస్తే సీపీఐ ప్రజలపక్షాన ఉంటూ.. పోరాడుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, పార్టీ నాయకులు పెద్దహన్మంతు, కుర్మయ్య, చిన్నకుర్మయ్య, కోటయ్య, కుర్వహన్మంతు, పరశురాముడు, కాకంశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరిస్తా..



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా

అమరచింత: అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆమ్మాపురానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీహరిని పట్టణ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గం నుంచి నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొందిన తాను, అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. అమరచింత మున్సిపాలిటీలో రహదారులు, మురుగు కాల్వలు, క్రీడా ప్రాంగణాలు, పార్కుల ఏర్పాటుతో పాటు ప్రధాన రహదారి విస్తరణ పనులు త్వరితంగా చేపట్టేందుకు తగు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర గీత కార్మిక సంఘం చైర్మన్ కేశం, నాగరాజ్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మున్సిపల్ మేనేజర్ బాలగోవిందు, ఆర్ఐ కృష్ణయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి




ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న పద్మజా జలంధర్‌రెడ్డి

ఆత్మకూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని అధైర్యపడకుండా రెట్టింపుస్థాయిలో ముందుకెళ్దామని, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సతీమని మాదిరెడ్డి పద్మజారెడ్డి అన్నారు. సోమవారం ఆమె స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ నైతిక విజయం సాధించిందని, నియోజకవర్గంలో అద్భుతమైన శక్తిగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, నాయకులు శ్రీనివాస్, రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

అమరచింత: కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్య పడాల్సిన అవసరం లేదని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు మాదిరెడ్డి పద్మజా జలంధర్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఆదరించిన ప్రతి ఒక్కరిని మరవమన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం ఓటమి, గెలుపులు సహజమన్నారు. జలేంధర్‌రెడ్డి పదవీ కోసమే ప్రజల మధ్య ఉండరని, ఎల్లప్పుడు ప్రజా సమస్యలపై దృష్టిసారించి వాటిని దూరం చేసేందుకు తనవంతు కృషి చేస్తారన్నారు. ఇకపై నియోజకవర్గంలో బీజేపీ ఎదుగుదలతో పాటు నిర్మాణాత్మకమైన కార్యకర్తల ఉన్నతి కోసం పాటు పడాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, రాజు, సురేష్, నారాయణ, విజయలక్ష్మి, వెంకట్‌రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కళావతమ్మ

పాన్‌గల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఆర్ఏల పెండింగ్ వేతనాలు నూతన ప్రభుత్వం త్వరగా చెల్లించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కేతేపల్లిలో మహిళ సమాఖ్య ముఖ్యుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని వనపర్తి, ఆత్మకూర్, పెబ్బేర్ మూడు క్లస్టర్లల్లోని వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలుగా మహిళలు పనిచేస్తున్నారని, వారికి మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతనాలు రెగ్యులర్‌గా అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించి వివిధ పోస్టుల్లో భర్తీ చేశారు. ఆయా పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న వారికి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వారికి రెగ్యూలర్‌గా వేతనాలు అందేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల హక్కుల కోసం ఐకమత్యంతో పోరాడాలన్నారు. తారకమ్మ, అలివేల, లక్ష్మి, ఎల్లమ్మ, అంజనమ్మ, లక్ష్మి, బుచ్చమ్మ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

గోపాల్‌పేట: మండల కేంద్రంలో సోమవారం తృటిలో ముగ్గురికి ప్రాణాపాయం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం నుంచి ఏదుట్ల వెళ్లే రోడ్డులో ఏదుట్లకు చెందిన ఆనంద్ తన కుటుంబంతో కలిసి వనపర్తి వెళ్తున్నాడు. గోపాల్‌పేట సమీపంలో మిషన్ భగీరథ పైపులు తయారీ కంపెనీ వద్ద పక్క నుంచి ఒక్కసారిగా బీటీ రోడ్డుపైకి టిప్పర్ దూసుకొచ్చి తగలడంతో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గోపాల్‌పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పొలం తగాదా.. వ్యక్తి రిమాండ్

గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడుకి చెందిన శ్రీకాంత్‌రెడ్డి పాత కక్షలు మనసులో పెట్టుకుని పక్కనున్న పొలానికి వెళ్తున్న విద్యుత్ వైర్లను ఒక పోల్‌పెట్టు కట్ చేసి తన పొలం అవసరాలకు వాడుతున్నాడని గోపాల్‌పేట ఏఈ ఆగస్టు నెలలో కేసు నమోదు చేశాడు. దర్యాప్తులో భాగంగా శ్రీకాంత్‌రెడ్డిని సోమవారం రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

108 వాహనంలో ప్రసవం



మదనాపురం: మదనాపురం మండల పరిధిలోని నరసింగాపురానికి చెందిన అంజనమ్మకు పురిటి నొప్పులు రావడంతో ఆదివారం అర్ధరాత్రి 108కు సమాచారం అందించారు. ఆమెను కడుకుంట్ల అంబులెన్స్‌లో మదనాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో నొప్పుల అధికమయ్యాయి. 108 వాహనంలోనే సిబ్బంది నార్మల్ డెలివరీ చేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చిందని టెక్నీషియల్ శశికుమార్ పైలెట్ రాఘవేంద్ర తెలిపారు. అనంతరం తల్లీబిడ్డను మదనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అడ్మిట్ చేశారు. ఆశ వర్కర్ శారద తదితరులు వెంట ఉన్నారు.

ఇంట్లో అగ్ని ప్రమాదం

పెబ్బేరు రూరల్: మండలంలోని వై శాఖాపూర్‌లోని కుర్వరాజు ఇంట్లో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మండలం, వై శాఖాపూర్‌కు చెందిన కుర్వరాజుకు, భార్య, తల్లి , ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను నాయనమ్మతో గ్రామంలో ఉంచి, వాళ్లు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. నాయనమ్మతో కలిసి ఇద్దరు పిల్లలు ఆదివారం ఇంట్లో నిద్రిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి చోటుచేసుకుంది. ఇంట్లో మంటలు చెలరేగడంతో గమనించిన నాయనమ్మ ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలను తీసుకొని బయటకు వచ్చింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ఆస్తినష్టం మాత్రం వాటిల్లింది. గ్రామస్తులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో కొంత డబ్బుతో పాటు బియ్యం, దుస్తులు తదితర వస్తువులు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం దాదాపు రూ.60 వేల మేర ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అగ్నిమాపక ఎస్ఐ శంకర్‌గౌడ్,



కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: వనపర్తి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి సోమవారం వనపర్తికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వనపర్తి శివారులోని కొత్తకోట రోడ్డులోని నాగవరం తండా వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి మేఘారెడ్డిని ప్రచార రథంపైకి ఎక్కించారు. కాంగ్రెస్ నాయకులు ద్విచక్రవాహనాల ర్యాలీ నడమ మేఘారెడ్డి ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ.. ముందుకు సాగారు. కొత్తకోట రోడ్డు, వివేకానంద మార్గ్, కొత్తబస్టాండ్, డిపో రోడ్డు, రాజీవ్ చౌక్, ఇందిరా పార్కు, శంకర్ గంజ్, కమాన్ చౌరస్తా మీదగా ఊరేగింపు గాంధీచౌక్‌కు చేరుకుంది. పట్టణంలోని ఆయా చౌరస్తాల వద్ద కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చుతూ కాంగ్రెస్ జిందాబాద్, మేఘారెడ్డి జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దారి పొడువున అక్కడక్కడ పలువురు అభిమానులు అభివాదం చేస్తున్న మేఘారెడ్డిపై పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, కౌన్సిలర్లు బి.వెంకటేష్, బ్రహ్మం, విభూది నారాయణ, సత్యం, రాధాకృష్ణ, రవి, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం ప్రత్యేక పూజలు



రంగాపురం శివారులో ఉసిరి చెట్టు కింద పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: కార్తీకమాసం చివరి సోమవారం, మాసశివరాత్రి సందర్భంగా స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ప్రముఖ పూజారి కరుణాకరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీభవాని మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెల మాసశివరాత్రి సందర్భంగా బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆత్మకూర్‌లోని అయ్యప్ప కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతినిత్యం పూజా కార్యక్రమాలతో పాటు దీక్షపరులకు అన్నదానం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు కూరగాయల రఘు, ఎస్టీడీ శ్రీను, జిన్నారం శ్రీను, శ్రీకాంత్, బాలు, భరత్, బాబు, నరేష్‌రెడ్డి, పాండు, శ్రవణ్, మెకానిక్ శ్రీను, నరేందర్ పాల్గొన్నారు.

ఉసిరి చెట్టు కింద పూజలు

పెబ్బేరు రూరల్: కార్తీక మాసం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో మహిళలు, పురుషులు చిన్నారులు మండలంలోని రంగాపురం గ్రామ శివారులోని మామిడితోటలోని ఉసిరి చెట్టుకు పూజలు చేసి, అక్కడే వన భోజనాలు చేశారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకింద పూజలు నిర్వహించి భోజనాలు చేస్తే అశ్వమేధ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని, కార్తీకమాసంలో ఉసిరి చెట్టులో మహావిష్ణువు, లక్ష్మీదేవి కొలువై ఉంటారని భక్తుల నమ్మకం.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు, దీక్షపరులు

‘పది’ విద్యార్థుల వివరాల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల నిమిత్తం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం పదో తరగతి విద్యార్థుల డేటా(నామినల్ రోల్) వివరాలను పాఠశాలల వారీగా పరిశీలించినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థుల డేటా వివరాలను క్షుణ్ణంగా పరిశీలన చేసి ఎలాంటి తప్పులు లేకుండా పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల వివరాలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా అంశాలపై టీం సభ్యులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల్లోని విద్యార్థుల డేటా వివరాలను మూడు రోజుల పాటు పరిశీలించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. మండలాల వారీగా డేటా వివరాలను పరిశీలన టీం మెంబర్స్ ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశీలన టీం మెంబర్స్ లక్ష్మీనారాయణ, వెంకటేష్ మోహన్, చంద్రశేఖర్, గోవింద్, జగన్ సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేష్

వనపర్తిటౌన్: మానవ హక్కులపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి 1948 సంత్సరం డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ ఏడాది అందరికీ గౌరవం, స్వేచ్ఛ, న్యాయం అనే నినాదాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ హక్కులను సక్రమంగా వినియోగించుకోవాలని, మానవ జీవనాభివృద్ధికి హక్కులు తోడ్పడతాయన్నారు. మానవహక్కుల పరిరక్షణకు మానవ హక్కుల కమిషన్ బాధ్యత వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రూప, మంజుల, అధ్యాపకులు పుష్ప, విష్ణు, సంధ్య, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాలి

పెబ్బేరు రూరల్: స్థానిక సంస్థల నోటిఫికేషన్ దృష్ట్యా పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ మాదిగ, ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని గ్రామానికి చెందిన యువకులు రాములు, విష్ణు, గంధం రాంచందర్, గంధం సాయి ప్రసాద్, విజయ్ సోమవారం వనపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి నేటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యంలో ఓటు వేసే హక్కు ఉన్నట్లుగా, అన్ని అర్హతలు ఉండి ఎన్నికల్లో పోటీ చేయాలనే హక్కు కూడా ఉందన్నారు. గ్రామంలో మా సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగానే ఉన్నా.. ఎస్సీ రిజర్వేషన్ కావడం లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో మాగ్రామాన్ని ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

క్లుప్తంగా

విద్యార్థుల సత్ప్రవర్తన తల్లిదండ్రుల బాధ్యత



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్‌లో ‘ఆధునిక సమాజంలో విద్యార్థుల ప్రవర్తన– తల్లిదండ్రుల బాధ్యత’ అనే అంశంపై ‘హ్యాపీ ఫ్యామిలీ’ పేరిట ప్రముఖ సైకలాజిస్టు శాంతిస్వరూప్‌తో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరయ్యారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో విద్యార్థులు ఆలోచనల్లో మార్పు– తల్లిదండ్రులు అనుసరించాల్సిన విధానంపై ఒక మంచి విశ్లేషణ కార్యక్రమం నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమం తమకు చాలా ఉపయోగపడిందని, పిల్లల మనస్తత్వంపై మేము ఎలా ఆలోచించాలో చెప్పారని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కేపీఎస్ చైర్మన్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ కార్యవర్గం ఎన్నిక



అమరచింత: పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్ప ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి క్యామ భాస్కర్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా మాకం నరసింహులు(గురుస్వామి), ఆలయ ధర్మకర్తగా కాడ్గి గణేష్ స్వామి, అధ్యక్షుడిగా మ్యాడం కృష్ణ(గురుస్వామి)ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అంజన్‌గౌడ్, నరసింహులు గౌడ్, కోశాధికారిగా తోకలి రమేష్, కార్యదర్శిగా డీసీ రాజశేఖర్‌తో పాటు, సలహాదారులుగా మరేడి కృష్ణరెడ్డి, లచ్చన్న గౌడ్, బంగారు శివయ్య, గంజిశంకర్, కమలాకర్ గౌడ్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధితో మాలధారుల కోసం ఆలయ ఆవరణలో వసతులు కల్పిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



ఆత్మకూర్: నారాయణపేట జిల్లా మిడ్జిల్ మండలంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండర్– 14 బాలికల వాలీబాల్ పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ ఖాదర్ తెలిపారు. రెండు రోజులుగా జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వనపర్తి జట్టు తరఫున ఆత్మకూర్‌కు చెందిన కావ్య, శహస్ర, పూజిత, లాస్య, అమృత, శివలత పోటీల్లో తలపడ్డారన్నారు. అత్యంత ప్రతిభ కనబర్చిన కావ్య, శహస్ర ఉమ్మడి జిల్లా జట్టులో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో నారాయణపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను స్థానికులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

మంత్రి సీతక్కకు వినతి



మదనాపురం: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి సమర్పించామని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి పి.మంగ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బి.స్వప్న, కె.నర్సమ్మ, డి.సునీత, నాగమణి, మణమ్మ, సమ్మక్క, సరోజ, నిర్మల, రాజేశ్వరి, అన్నపూర్ణ నారాయణమ్మ, కవిత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 11వ వార్డులోని సూగూరు కిష్టమ్మ(68) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న జీఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు మృతురాలి ఇంటికి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి శవపేటిక ఖర్చు నిమిత్తం రూ.2,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె.సతీష్‌రాజ్, కర్ణకుమార్, జైపాల్, కాలనీ యువకులు జె.ఆర్.కుమార్, నాగేంద్రబాబు ఉన్నారు.